
# ఒంటితాడి - ఊడలమర్రి

— విజయలక్ష్మి



పదేళ్ళు కావస్తున్నాది నేనీ ఊరు వచ్చి, యిది నేను పుట్టి పెరిగిన ఊరే అయినా, యీ మధ్య కాలంలో మా అన్నదమ్ములు ఉద్యోగరీత్యా బదిలీ లవుతుంటే, వాళ్ళ సామానుతో పాటు మా అమ్మా, నాన్నాకూడ ఊరూరూ తిరగడంతో నా ‘పుట్టింటి’కి ఒక ఊరంటూ లేకుండాపోయింది. అదృష్ట వశాత్తూ మళ్ళీ మా తమ్ముడికి యీవూళ్లోనే ఉద్యోగం కావడాన, మా స్వంత యింట్లో అద్దెకున్నవాళ్ళను ఖాళీ చేయించి మా అమ్మ, నాన్న, తమ్ముడు, మరదలు మళ్ళీ మా యింట్లో స్థిరపడ్డారు. నాకు పోయిన నిధి దొరికినట్లయింది. "అమ్మకు నాన్నకు నన్ను చూడాలనుందట, రమ్మని వ్రాస్తున్నారని" మా యింట్లో చెప్పి, ఓ నెల రోజులకు సరిపడు బట్టలు సర్దుకుని

మూన్నాళ్ళ క్రిందటే యీ వూరికి, మా యింటికి వచ్చాను. యీ దశాబ్దంలో ఈ వూరెంత మారిందో నాకు తెలిసినంతగా, యిక్కడే వుండిపోయిన మీకు తెలియదు 'ఊరు బాగుపడిందని' గుర్తించేసరికి దిగులయింది. మా యింటికి ఆనుకునే ఆడపిల్లల స్కూలు ఉండేది. స్కూలువాళ్ళు ప్లేగ్రౌండుకు కావాలంటే మా స్థలంకూడ మంచి ధర వచ్చిందని అమ్మేశాం. ఆ స్కూల్లోనే నేను థర్డుఫారం రెండుసార్లు తప్పేసరికి మా నాన్న 'చదువు నీ ఒంటికి పడదులే అమ్మా' అని మాన్పించి పెళ్ళి చేశారు నాకు. ఆ స్కూలు యిప్పుడు హైస్కూలు అయిందట. సాయంత్రం చల్లబడ్డాక స్కూలుకు వెళ్ళాను — నేను చదువుకున్న స్కూలు ఎట్లా వుందో, ఎంత మారిందో చూద్దామని. గేటుదగ్గిర వాచ్ మన్ 'ఎవరది' అనడిగాడు. గొంతు గుర్తుపట్టి ఆశ్చర్యంగా "రెడ్డయ్యా నువ్వు నన్ను గుర్తుపట్టలేదా ? నేను యీ ప్రక్కింటివాళ్ళమ్మాయిని; ఇక్కడేగా చదివాను; యీ స్థలం మాదేగా మొదట్లో," అన్నాను. రెడ్డయ్య ఆశ్చర్యంగా "లలితమ్మగారా, తల్లీ! ఎన్నాళ్ళయిందండి మిమ్మల్ని చూసి. ముసలాణ్ణయ్యానమ్మా, గుర్తు తగ్గింది. రండి, చూడాలనిపించి వచ్చారా," అని అడిగి నన్ను వెంటపెట్టుకుని నాలుగు ప్రక్కలా త్రిప్పాడు. మా స్థలం చూద్దామని దక్షిణపు వైపు వెళ్ళాను; ఆశ్చర్యపోయాను. దక్షిణాది దేవాలయాల్లో చూసిన వెయ్యి స్థంభాల మండపాలను గుర్తుకుతెచ్చింది. అక్కడ పెరిగి పాదుకున్న మర్రిచెట్టు. "ఈ చెట్టు — ఈ చెట్టు — నాకు గుర్తే లేదు," అన్నాను తడబడుతూ. రెడ్డయ్య "మీ రెరిగినపుడు యీ చెట్టు లేదండి. ఇక్కడుండేది ఓ తాడిచెట్టు," అన్నాడు. ఔను, ఒకే ఒక తాడిచెట్టు వుండేది మా దొడ్లో. వేసవికాలం ముంజెలు తినే వాళ్ళం. ఒక రోజు మా అమ్మ పాత చీర అంచు చింపి కాళ్ళకు బందా లేసుకుని చెట్టెక్కడం నేర్చుకుంటున్నాను. మా తమ్ముడు వెనుకనుంచి "అమ్మొచ్చె." అని కేక పెట్టాడు. అమాంతం చేతులు వదిలేసి క్రింద పడ్డాను. తర్వాత వారం రోజులు పడక పెట్టాను ఆ తాడిచెట్టు కనపడకపోయేసరికి నిజంగా దిగులేసింది నాకు. 'ఆ తాడిచెట్టేమయింది, ఈ మర్రిచెట్టును ఎవరు వేశారు?'' అనడిగాను. రెడ్డయ్య: ''వేసిన మొక్క యింత వృద్ధిలోకి వస్తుందామ్మా ? కాకి రెట్టకు తాడిచెట్టుమీద మొలిచిందీ మర్రి చెట్టు. మొదట్లో రెండు మూడు సార్లు పీకిపారెద్దామనుకుని మళ్ళా జాప్యం చేశాను. ఈ పదేళ్ళలో యింత మాను అయింది. తాడిచెట్టు అయిపులేకుండా పోయింది. ఇదే బాగుందమ్మా! పిల్లలు దీ నీడన ఆడుకుంటున్నారు. తాడిచెట్టు కింత కళ వుంటుందాండీ?" అన్నాడు.



బంగారం దొరకటంలేదుగా !

---

మఱ్ఱిచెట్టు మండపంలాగా చల్లగా వుంది.

మర్నాడు వుదయం, మాటల్లో మా అమ్మని అడిగాను "అమ్మా రేణుక ఎట్లావుంది? ప్రాక్టీసు బాగావుందా? ఏమాత్రం సంపాదించింది? పెళ్ళి చేసుకుందా?" అని.

అమ్మ నిర్ఘాంతపోయి చెప్పింది: "నీకు తెలీనేతెలీదా? నేనెట్లా మర్చిపోయాను నీకు వ్రాయడం? రేణుక చచ్చిపోయి రెండేళ్ళవుతుంది. కేన్సర్ వచ్చి నానా అవస్థా పడిపోయింది," అన్నది.

నాకు నోటమాటరాలేదు రేణుకా నేనూ నాలుగేళ్ళ క్లాసుమేట్సుం. ఓణీలు వేసుకునేవయసు వచ్చేటప్పటికి నాకు చదువుమీద శ్రద్ధ తగ్గడం, లేసులు అల్లడంలో ఆసక్తి పెరగడంతో వరసగా తప్పాను. చదువుమానేసిన ఏడాదిలోపలే పెళ్ళయింది నాకు. పెళ్ళయ్యాక పదేళ్ళ వరకు నాకు పొయ్యూదుకోవడంతోనూ, పిల్లలముక్కులు తుడుచుకోవడంతోనూ, సరిపోయింది. ఆ పదేళ్ళలో రేణుక యీవూళ్ళో స్కూలూ. కాలేజీ దాటి వైజాగు కాలేజికి వెళ్ళి డాక్టరయివచ్చింది. యీవూళ్ళోనే ప్రాక్టీసు పెట్టింది. ఆర్నెల్లకోసారి నేను పుట్టింటికి వచ్చినప్పుడల్లా రేణుకను కలుసుకునేదాన్ని. ఆయేటికాయేడు ఆమె ప్రాక్టీసు పెరుగుతూ వచ్చింది. వాళ్ళ యిల్లంతా ఖరీదైన వస్తువులు నిండుకున్నాయి. రేణుక చెల్లెళ్ళు పట్టుచీరెలు, పట్టులంగాలు కట్టుకుని కాలేజికి, స్కూలుకు కారులో

వెళ్ళడం చూచి ఆశ్చర్యపోయాను. నాకు గుర్తున్నంతవరకు రేణుక చదువుతునే రోజుల్లో గంజిపెట్టని, యిస్త్రీలేని చీరలే తప్ప, ఫెళఫెళమంటూ మడతలుతీరిన దుస్తులు ధరించనేలేదు! నేను ఆమెతో "మీ చెల్లెళ్ళనిగూడ మెడిసన్‌కు పంపుతావా?" అనడిగాను ఒకసారి.

"అబ్బే లేదు, నేను సంపాదించేది చాల్తా? మంచి అబ్బాయిల్ని వెదికి వాళ్ళకు పెళ్ళిళ్ళు చేస్తాము" అంది రేణుక.

నాకు ఒళ్ళు మండింది

"నాపసాని కబుర్లు చెప్పకు! నువ్వు చేసుకోకుండా, వాళ్ళకు నువ్వు చేసేదేమిటి?" అన్నాను.


రేణుక నవ్వింది. అది నవ్వుకాదు. ఏమిటో చెప్పడం నాకు చేతకాదు. మరుక్షణమే ఆమెకళ్ళు నీళ్ళతో నిండాయి. నాచెయ్యి తన చేతిలోకి తీసుకుని నొక్కుతూ "లలితా! నీకు తెలీదు నా బ్రతుకు! సంపాదన లేని అన్నయ్యలు భార్యా పిల్లలతో యీ యింట్లోనే వుంటున్నారు. అమ్మకు చెల్లెళ్ళగురించి బెంగ. డబ్బుతో పొందగల సుఖాలకు ఎవరికీ లోటు లేకపోయినా, నేను ఎక్కడ పెళ్ళి చేసుకుంటానోఅనేభయం మాయింట్లోవాళ్ళందరినీ రాత్రింబవళ్ళు పీడిస్తున్నది. వాళ్ళకు మనశ్శాంతి లేకుండావుంది. నిరుడు పేపరులో ప్రకటించాము; జవాబులు వచ్చేసరికి యింట్లో అందరికీ తెలిసిపోయింది. పెద్ద రాద్ధాంతమైంది. అమ్మ ఏడుస్తూ 'యీపేపరుపెళ్ళిళ్ళకు సిద్ధపడేవాళ్ళంతా కులం లేనివాళ్ళు, గోత్రం లేనివాళ్ళు, గొంతుకోసేవాళ్ళు' అంది, అన్నయ్యలు: 'ఎవరిని నమ్మడానికీ వీలులేదు; సంపాదన చూసి ముందుకు వస్తారు, మోసపోకు' అన్నారు. ఆరాత్రి అంతా కూడబలుక్కొని మర్నాడు అమ్మా అన్నయ్యలుకూడ 'నువ్వీవిధంగా ఎవణ్ణోఒకణ్ణి పెళ్ళాడితే, నీకు నష్టం లేకపోవచ్చుగాని రేపు తక్కిన యిద్దరు ఆడపిల్లలకు ఎట్లా పెళ్ళిచేస్తాం? నీకు చదువుంది, ప్రాక్టీసుంది. పెళ్ళి కాకపోయినా ఫరవాలేదు. వాళ్ళు నీలాగా డాక్టర్లవుతారా? పెళ్ళికూడా కాకపోతే ఏమయిపోతారు," అన్నారు.

"లలితా! నేనేమీ జవాబు చెప్పలేదు. లోపలకు వెళ్ళి చింపినకవర్లు, చింపని కవర్లు కూడతెచ్చి వాళ్ళఎదుటే తగలపెట్టాను. ఆరాత్రి వాళ్ళంతా సుఖంగా నిద్రపోయారు," అంది.

రేణుక త్యాగనిరతికి సంతోషించినా, అయినవాళ్ళ స్వార్థానికి తలఒగ్గిన బలహీనతకు నాకు జుగుప్స కలిగింది.

"నిన్ను వారు ఇలా అవమానిస్తూంటే, నిన్నిట్లా 'ఎక్స్‌ప్లాయిట్' చేస్తూంటే వాళ్ళమీద ప్రేమ ఎట్లా చావలేదు నీకు," అన్నాను.

రేణుక నవ్వి "ప్రేమ చావలేదు



కాని తగ్గించి. దాన్ని భర్తీచేయడానికి జాలి పెట్టించి. వాళ్ళ పిరికితనాన్ని చూచి," అన్నది. ఆ ఫిలాసఫీ నా కర్థం కాలేదు. ఆ తర్వాత కూడా రెండు, మూడుసార్లు కలుసుకున్నాను రేణుకను. నేవెళ్ళినపుడల్లా నాప్రమేయం లేకుండానే నన్ను, నాపిల్లలను పరీక్ష చేసి "వీళ్ళకు యీ కాల్సియం మాత్రలు

యిస్తూండు. నువ్వీ టానిక్ పుచ్చుకో." అంటూ శాంపిల్ మందుసీసాలు యిస్తుండేది నాకు. ఒకరోజు "నేను వచ్చినప్పుడల్లా నువ్విట్లా యిస్తే, నేను 'ఫ్రీచెకప్' కోసమే నిన్ను చూడ్డానికి వస్తున్నాననుకుంటారు అందరూ." అన్నాను, నిజమైన భయంతో.

అందుకు రేణుక చాలా గాయపడింది. నిట్టూర్చి "ఇంకెప్పుడూ నిన్ను పేషంట్‌గా చూడను. తెలీకుండా చాలా నొప్పించాను నిన్ను," అంది.

రేణుకనలాగా నొప్పించినందుకు నిజంగా పశ్చాత్తాపం కలిగింది నాకు. అంతే, ఆ తర్వాత మా వాళ్ళు ఆ ఊరు విడిచిపెట్టడంతో యీ పదేళ్ళూ నేనిటు రానేలేదు. రేణుకకూ నాకూ ఉత్తరాలు వ్రాసుకునే అలవాటు లేదు. రేణుక పోయిన రెండేళ్ళకు గాని ఆ కబురు నాకు తెలియలేదు.

మర్నాడు సాయంత్రం నాగేశ్వరస్వామి గుళ్ళో చిన్మయానందస్వామి గీతా ప్రసంగాలు జరుగుతున్నాయని విని, వాటినదకని బయలుదేరాము మా అమ్మా, నేనూ. దారిలో రేణుకావాళ్ళ వీధి రాగానే 'అదే రేణుకావాళ్ళ యిల్లు' అంది మా అమ్మ. ఆశ్చర్యంగా చూశాను నేను. అది యిల్లు కాదు, పెద్ద మేడ. "రేణుక పోగానే యిన్సూరెన్సు డబ్బు లక్ష రూపాయలు వచ్చిందట. అది పోయాకనే యీ మేడ కట్టుకున్నారు అందరి పెళ్ళిళ్ళయ్యాయి; అందరూ పిల్లపాపల్తో ఆ మేడలోనే వుంటున్నారు: బావలు, మరదులు కలిసి ఏదో బిజినెస్ చేస్తున్నారట," అంది అమ్మ. ఏనుగు చచ్చినా బ్రతికినా వెయ్యి వరహాలట; బ్రతికున్నాళ్ళు సంపాయించింది కాకుండా చచ్చిపోయి కూడ నట్టింట డబ్బు కురిపించిందన్న మాట! ఆ మేడ అందంలో, మేడలో వినబడే నవ్వుల్లో, ఆ తోటలో పూసే పువ్వుల్లో వెదికినా కనిపించదు రేణుక.

రేణుకకు పెళ్ళీ పెటాకులూ లేవు. పిల్లాజెల్లా లేరు. ఆమెకు ఆత్మసౌందర్యం ఎంతైనా వుండుకాక! ఒంటరిగా అంత పెద్ద మేడలో రేణుక నిలబడితే ఏమైనా అందంగా వుండేదా? రేణుక చచ్చిపోయిందన్న బాధ అనవసరం. ఆ యిల్లు లక్షణంగా పదిమంది పిల్లాపాపల్తో కళకళలాడుతూ వుంది. ఒంటి తాడిచెట్టుకన్నా, ఊడలు దిగిన మర్రిచెట్టు నిజంగా అందమైనది.

